క్లుప్తంగా

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: కాళీమాత దేవస్థాన కమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం శివాజీచౌక్‌లోని దేవస్థానం వద్ద పేదలకు అన్నదానం చేశారు. రమేష్ మాట్లాడుతూ నెలలో రెండో శుక్రవారం దేవస్థానం వద్ద అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మర్రి శ్రీనివాసరావు, కందేపి సీతారామయ్య, నక్కా వెంకటేశ్వర్లు, ఉమ్మలనేని మదన్, ఫిరోజ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



కొల్లిపర: ఉపాధి హామీ పథకం పనులు నాణ్యంగా చేయాలని, యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఎంపీడీఓ పి.శ్రీనివాసులు చెప్పారు. శుక్రవారం మండలంలోని కొల్లిపర, తూములూరు, మున్నంగి, వల్లభాపురం, అత్తోట గ్రామాల్లో నిర్వహిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గట్లు పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మేకప్ ఆర్టిస్ట్ ప్రసాద్‌కు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో శుక్రవారం రైతుబిడ్డ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అనంతరం ప్రముఖ మేకప్ ఆర్టిస్ట్ సిద్దెల ప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో చావలి రాజేంద్రప్రసాద్, పినపాటి లూకయ్య, పినపాటి చంద్రశేఖర్, పినపాటి దాసు, మొవ్వా డేవిడ్, సిద్దెల కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కొలకలూరులో తపస్సుకాల ఉపవాస ప్రార్థన

తెనాలి టౌన్: రూరల్ మండలం కొలకలూరులోని ఆర్సీఎం చర్చిలో శుక్రవారం రాత్రి తపస్సు కాల ఉపవాస ప్రార్థనలు జరిపారు. ఆర్సీఎం చర్చి విచారణ గురువు రెవరెండ్ కె.థామస్‌సాగర్ తంబి, ఫాదర్ హృదయరాజు (వినుకొండ) బైబిల్ గ్రంథం వాక్యోపదేశం చేశారు. తపస్సు కాలంలో పాటించాల్సిన నియమాలు, ఉపవాస ప్రార్థనల గురించి వివరించారు. ఇన్‌సెంట్‌పాల్ సొసైటీ ప్రెసిడెంట్ కావూరి రవిబాబు ఆధ్వర్యంలో వృద్ధులకు, దత్తత కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు మల్లవరపు బుల్లయ్య, ఆరాంబాక రవి, కొలకలూరి ఏసుపాదం, కె.మోహన్‌రావు, సుద్దపల్లి ముసలయ్య, కొలకలూరి కామయ్య, మహిళలు, భక్తులు, సంఘస్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు.

కాల్వలో పడి క్యాటరింగ్ కార్మికుడి మృతి



తెనాలిరూరల్: కాల్వలో పడి క్యాటరింగ్ కార్మికుడు మృతి చెందిన ఘటన తెనాలిలో జరిగింది. సుమారు 65 నుంచి 70 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి తెనాలి రైల్వే స్టేషన్ పరిసరాల్లో రోడ్డు వెంబడి, లాడ్జిలలో నివసిస్తూ క్యాటరింగ్ పనులకు వెళ్తుండేవాడు. ఎక్కడి నుంచి వచ్చాడో, ఇక్కడెందుకు ఉంటున్నాడో ఎవరికీ తెలియకపోయినా అందరూ రాజు అని పిలుస్తుండే వారు. క్యాటరింగ్ పనులకు వెళ్లే వారు తమతో తీసుకెళ్తుండే వారు. అతను తెనాలి బస్టాండ్ వంతెన వద్ద శుక్రవారం సాయంత్రం తూర్పు కాల్వలో పడి మృతి చెందాడు. ఘటనాస్థలాన్ని త్రీ టౌన్ పోలీసులు పరిశీలిచారు. మృతదేహాన్ని వెలికి తీయించి తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు ధైర్యంగా ఉండాలి

తాడేపల్లి రూరల్: మహిళలు అన్ని విషయాల్లో ధైర్యంగా ఉండి తమ సమస్యలు పరిష్కరించేందుకు ముందుకు రావాలని సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నకుమార్ అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని డొలాస్ నగర్ గుడ్‌షెపర్డ్ కాన్వెంట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ మహిళలు పెట్టినటువంటి చాలా కేసుల్లో సరియైన సాక్ష్యాధారాలు లేకపోవడం వలన కేసులు నీరుగారిపోతున్నాయని వివరించారు. ముఖ్యంగా గృహహింస చట్టం, మనోవర్తి చట్టం, నిర్భయ చట్టాలపై ప్రతి ప్రతి ఒక్క మహిళకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమానికి ఐద్వా గుంటూరు జిల్లా అధ్యక్షురాలు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, సీనియర్ అడ్వకేట్ శ్యామల, సీడీపీఓ సరిత, సిస్టర్స్ ఊర్మిళ, ఎస్తేరు రాణి పాల్గొన్నారు.

సమస్య ఎలా తీరద్దీ!

- రోజురోజుకీ ట్రాఫిక్ సమస్య జటిలం
- ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే మేలు
- రోడ్లు, వంతెనలు విస్తరించాలంటున్న ప్రజలు



తెనాలి పట్టణంలో ట్రాఫిక్ రద్దీ

తెనాలి రూరల్: రోజురోజుకీ పెరుగుతున్న వాహనాల వినియోగంతో తెనాలిలో ట్రాఫిక్ రద్దీ అంతకంతకూ పెరుగుతూనే ఉంది. పశ్చిమ డెల్టాలో ప్రధానమైన పట్టణం కావడంతో పరిసర గ్రామాల నుంచి ప్రజలు నిత్యం తెనాలికి వస్తుంటారు. ఫలితంగా పట్టణంలో రద్దీ ఎక్కువగా ఉంటోంది. గతంలో మార్కెట్ వంతెన వద్ద స్కైవాక్ బ్రిడ్జి నిర్మాణం కోసం అధికారులు మూడు రోజుల పాటు చేపట్టిన సర్వేలో మార్కెట్ వంతెన వద్ద తెనాలి–గుంటూరు రోడ్డు, తెనాలి–చందోలు రహదారిలో గంటకు 1,400 నుంచి 1,600 మంది పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారని తేలింది. ఇక వాహనదారుల సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇక్కడి మెయిన్ రోడ్డు, బోస్ రోడ్డు, పాత సత్యనారాయణ టాకీస్ రోడ్డు, నెహ్రూ రోడ్డు, ఆంధ్రా బ్రిడ్జి నుంచి గంగానమ్మపేటకు వెళ్లే రోడ్డు, ఓవర్ బ్రిడ్జి డౌన్ తదితర ప్రాంతాలు ఎప్పుడూ వాహనాలతో రద్దీగా ఉంటాయి. పెరుగుతున్న జనాభా, వాహనాల వినియోగానికి తగ్గట్టు రోడ్ల విస్తరణ జరగకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తప్పడంలేదు. మంగళగిరి నుంచి చినరావూరు పార్కు వరకు వచ్చే ఆర్టీసీ బస్సులు కొత్త వంతెన వద్ద మలుపు తిరిగే సమయంలో ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రోడ్ల విస్తరణతోపాటు కొత్త వంతెనను విస్తరించడం లేదా సమాంతరంగా మరో వంతెనను నిర్మిస్తే కొంత వరకు వాహనదారుల ఇబ్బందులు తీరతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఏళ్ల క్రితమే ట్రాఫిక్ అడ్వయిజరీ కమిటీ..

2009లో సబ్‌కలెక్టర్/ఆర్డీఓ అధ్యక్షతన ట్రాఫిక్ అడ్వయిజరీ కమిటీ ఏర్పాటు చేశారు. ఇందులో మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, పట్టణ సీఐ, టౌన్‌ప్లానింగ్ అధికారి, ఆర్టీసీ డీఎం, ట్రాఫిక్ ఎస్సై, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ డీఈలు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సభ్యులుగా ఉంటారని నిర్ణయించారు. అప్పట్లో ట్రాఫిక్ పరిశీలన పేరిట నాలుగైదుసార్లు పట్టణంలో పర్యటించి హడావుడి చేసిన అడ్వయిజరీ కమిటీ సభ్యులు తరువాత దాని గురించి పట్టించుకోకపోవడం గమనార్హం. పట్టణంలో కీలకమైన ట్రాఫిక్ విభాగంలో 30 నుంచి 35 మంది వరకు సిబ్బంది అవసరం ఉంది. అయితే ప్రస్తుతం కేవలం 10 మంది వరకు మాత్రమే ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు బందోబస్తు డ్యూటీలు ఇక్కడి సిబ్బందికి నిత్యకృత్యమయ్యాయి. ఇక్కడ ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసి తగిన సిబ్బందిని నియమిస్తే సమస్య పరిష్కరించేందుకు కొంత వరకు వెసులుబాటు కలుగుతుంది.

వంతెనల నిర్మాణం చేపట్టాలి



పట్టణంలో రోజు రోజుకీ ట్రాఫిక్ సమస్య పెరిగిపోతోంది. వాహనాల వినియోగం పెరుగుతుండడంతో రద్దీ ఎక్కువగా ఉంటోంది. పట్టణంలో రోడ్ల విస్తరణతోపాటు వంతెనల నిర్మాణం చేపట్టాలి. వీలు కాని పక్షంలో వంతెనలను విస్తరించేలా అధికారులు ఆలోచన చేస్తే బాగుంటుంది.

– పినపాటి రవికిరణ్, మల్లెపాడు

పటిష్ట చర్యలు



డీఎస్పీ, సీఐల ఆదేశానుసారం ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. ఉన్న సిబ్బందిని వినియోగించుకుంటూనే సమస్య లేకుండా చూస్తున్నాం. ఒంటి పూట బడులు ప్రారంభమైన నేపథ్యంలో ఉదయం ఆరు గంటల నుంచే సిబ్బంది విధుల్లో ఉంటున్నారు. మెయిన్ రోడ్డులో తోపుడు బండ్లనూ తొలగించాం. ఎక్కడైనా ట్రాఫిక్ సమస్య తలెత్తితే వెంటనే చర్యలు తీసుకుంటున్నాం.

– జె.శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్ఐ

నైపుణ్యంతో కూడిన విద్య అవసరం

తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ చిత్రంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

తెనాలిఅర్బన్: దేశ భవిష్యత్‌కు యువతే పునాది అని, నేటి పోటీ ప్రపంచంలో నిలబడాలంటే నైపుణ్యంతో కూడిన విద్య ఎంతో అవసరమని తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ పేర్కొన్నారు. జేఎంజే మహిళా కళాశాల 60వ వార్షికోత్సవం శుక్రవారం మధ్యాహ్నం కళాశాల ఆవరణలో నిర్వహించారు. గీతాంజలిశర్మ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వారు ఏ రంగంలో అయినా రాణించవచ్చని తెలిపారు. విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ డాక్టర్ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ మంచి నడవడిక భవిష్యత్‌కు పునాది వేస్తుందని పేర్కొన్నారు. అందరూ కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విశ్రాంత డీన్ టి.నీరజ, కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ థెరిస్సా, ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ, వైస్ ప్రిన్సిపల్ శారద పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో ఉగాది నాటికి గృహ ప్రవేశాలు

జిల్లా హెడ్ హౌసింగ్ అధికారి సాయినాథ్‌కుమార్



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న జిల్లా హెడ్ హౌసింగ్ అధికారి సాయినాథ్ కుమార్

కొల్లిపర: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, ఉగాది నాటికి గృహ ప్రవేశాలు జరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా హెడ్ హౌసింగ్ అధికారి కె.వి.ఎస్.సాయినాథ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో డివిజన్ హెడ్ హౌసింగ్ అధికారి వై.భాస్కరరావుతో కలిసి ఆయన జగనన్న కాలనీలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా చూడాలన్నారు. మండలంలో 28 లేఅవుట్లలో 1,759 గృహాలు మంజూరయ్యాయని, 229 గృహాలు పూర్తికాగా, బేస్‌మెంట్ లెవల్‌లో 442, రూఫ్‌లెవల్‌లో 37, శ్లాబ్ లెవల్‌లో 32 గృహాలు ఉన్నాయని వివరించారు. ఇంకా నిర్మాణం మొదలు పెట్టనివి 1,017 ఉన్నాయని వెల్లడించారు. అనంతరం సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ సిబ్బందితో ఆయన మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమయ్యారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఎంపీడీఓ పి.శ్రీనివాసులు, తహసీల్దారు జి.నాంచారయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలం గిరిప్రదక్షిణకు ప్రత్యేక సర్వీసులు

ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్

తెనాలిఅర్బన్: అరుణాచలంలో ఏప్రిల్ ఆరున జరిగే గిరి ప్రదక్షిణ మహోత్సవాలకు తెనాలి నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ నాలుగు రాత్రి 9 గంటలకు తెనాలి బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరుతుందని, ఐదో తేదీ ఉదయం శ్రీకాళహస్తిలో దర్శనం అనంతరం కాణిపాకంలో విఘ్నేశ్వర స్వామి దర్శనం, గోల్డెన్ టెంపుల్‌కు చేరుకుంటుందని వివరించారు. అదేరోజు రాత్రి అక్కడి నుంచి బస్సు బయలుదేరి పౌర్ణమి(ఆరో తేదీ) రోజున ఉదయం అరుణచలం చేరుకుటందని వెల్లడించారు. మహోత్సవాల అనంతరం రాత్రి అక్కడి నుంచి బయలుదేరి ఏడో తేదీన తెనాలికి బస్సు చేరుతుందని పేర్కొన్నారు. యాత్రకు రూ.2,520 చార్జిగా నిర్ణయించినట్లు చెప్పారు. 96278 సర్వీస్ నంబర్‌తో ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చని సూచించారు. వివరాలకు సెల్‌నంబర్‌లు 7382892492, 08644–221125 సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు పెన్షనర్స్ వినతి

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ తెనాలి యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను పలువురు కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ప్రధాన సమస్యలైన డీఏ, పీఆర్సీ బకాయిలు ఇప్పించాలని, 12వ పీఆర్సీ ఏర్పాటు, ఈహెచ్‌ఎస్ అమలు, ప్రతినెలా ఒకటో తేదీన పెన్షన్ అందించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అసోసియేషన్, తెనాలి యూనిట్ అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు, కోశాధికారి బెల్లంకొండ హృదయరాజు, ఉపాధ్యక్షుడు బీఎల్‌ఎస్‌ఎన్ మూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు కోటి హరినాథ్ తదితరులు ఉన్నారు.

రక్తహీనతతో అనారోగ్యం

ఫిరంగిపురం: రక్తహీనతతో అనారోగ్యం పాలవుతారని ఎంపీడీఓ డి.అనూరాధ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఏఎన్ఎంలకు నులిపురుగుల నివారణపై, మింగించే మాత్రలు గురించి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అనూరాధ మాట్లాడుతూ 14వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు భోజనం చేసిన తరువాత నులిపురుగు నివారణ మాత్రలు ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీలు మింగించాలని చెప్పారు. వైద్యాధికారి యానీగ్రేస్ మాట్లాడుతూ నులిపురుగుల నుంచి రక్షించుకోవాలంటే భోజనానికి ముందు విద్యార్థులు తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు, అనారోగ్యం, జ్వరం, వాంతులు, విరోచనాలు ఉన్న వారు ఆల్బెండాజోల్ మాత్రలు వేసుకోకూడదని చెప్పారు.

ఆల్బెండజోల్ మాత్రలతో రక్తహీనత దూరం



మాట్లాడుతున్న డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ అన్నపూర్ణ, చిత్రంలో కమిషనర్ జశ్వంతరావు

డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ అన్నపూర్ణ

తెనాలిఅర్బన్: ఆల్బెండజోల్ మాత్రలతో రక్తహీనతను అరికట్టవచ్చని తెనాలి డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ అన్నపూర్ణ చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో శుక్రవారం వైద్య, విద్యాశాఖాధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 14న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలని సూచించారు. విద్యార్థులు ఎవరైనా ఆరోజు పాఠశాలకు రాకుంటే 18న మాత్రలు అందించాలని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు, తహసీల్దార్ కె.రవిబాబు, ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ, జిల్లా వైద్యశాలలోని పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రేమ్ చంద్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.



ఆల్బెండజోల్ మాత్రలను వైద్య సిబ్బందికి అందజేస్తున్న తహసీల్దార్ రవిబాబు, ఎంపీడీఓ విజయాలక్ష్మణ్

నూరుశాతం మాత్రల పంపిణీ

తెనాలిరూరల్: ఈనెల 14న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నూరుశాతం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలని తహసీల్దార్ కె.రవిబాబు సూచించారు. తెనాలి మండలం సంగంజాగర్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. విద్యార్థుల్లో నులిపురుగుల నిర్మూలన కోసం ప్రభుత్వం మాత్రలను సిద్ధం చేసిందని వివరించారు. 14 నుంచి 18వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం నులి పురుగుల నివారణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రతి ఇంటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. ఎంపీడీవో విజయాలక్ష్మణ్, వైద్యాధికారులు డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ హనీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం



కరపత్రం ఆవిష్కరించిన డాక్టర్ జీవనలత

తెనాలి: పట్టణానికి చెందిన రెయిన్ బో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 12న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.జీవనలత శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. స్థానిక చెంచుపేటలోగల శబరి వృద్ధాలయం భవన సముదాయంలో 12వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే వైద్యశిబిరంలో అన్ని రకాల వ్యాధులకు వైద్యనిపుణులు పరీక్షలు చేస్తారని తెలిపారు. ఒమేగా హాస్పిటల్, గుంటూరు వైద్యులు మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్టు చెప్పారు. సుదర్శిని నేత్రవైద్యశాల వైద్యులు కంటి, క్యాటరాక్ట్ గుర్తింపు పరీక్షలు చేస్తారని వివరించారు. తెనాలికి చెందిన అవినాష్ నర్సింగ్ హోమ్, హెల్త్ హాస్పిటల్స్ వైద్య నిపుణులు ఎముకలు, గుండెకు సంబంధించిన పరీక్షలు చేస్తారని, డాక్టర్ లతాస్ డయాబెటిక్ వారిచే థైరాయిడ్, మధుమేహ పరీక్షలు ఉచితంగా చేసి, అవసరమైన మందులూ ఇవ్వనున్నట్టు వివరించారు. డాక్టర్ జీవనలతతోపాటు ట్రస్ట్ సభ్యులు కళ్యాణి, వరలక్ష్మి వైద్యశిబిరం కరపత్రాన్ని ఆవిష్కరించారు.

స్నాతకోత్సవం



వేషధారణలో ఉన్న చిన్నారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్‌బెర్రి పాఠశాల స్నాతకోత్సవం శుక్రవారం నిర్వహించారు. కొత్తపేటలోని రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరిగిన వేడుకల్లో ప్రైమరీ స్థాయి నుంచి ప్రాథమిక తరగతిలోకి అడుగిడుతున్న విద్యార్థులకు పట్టాలు అందజేశారు. విద్యార్థులు విభిన్న వేషధారణలతో ఆకట్టుకున్నారు. ప్రత్యేక గీతాలకు నృత్యాలు చేసి ఆహూతులను అలరించారు. ప్రిన్సిపాల్ కె.శేషులత మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి, శారీరక, మానసిక వికాసానికి విలువనిస్తూ విద్యనందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఓ ఆదినారాయణ, బీడీఎం శ్రీనివాస్, కో–ఆర్డినేటర్ నాగజ్యోతి, దివ్య, భానుప్రియ, మృత్యుంజయ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాల చోరీ

మంగళగిరి: నగర పరిధిలో రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాలు.. నిడమర్రు రోడ్డులో తోట ప్రకాష్, ద్విచక్ర వాహనాన్ని ఆపి తాళం వాహనానికే ఉంచి న్యూడిల్స్ తిని వచ్చే లోపు వాహనం మాయమైంది. అదే విధంగా తోట సుబ్రహ్మణ్యం షాపింగ్ మాల్ వద్ద ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి తిరిగి వచ్చే సరికి వాహనం మాయమైంది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత..

నగర పరిధిలోని తెనాలి ఫ్లైఓవర్‌పై ఆటోలో అక్రమంగా తరలిస్తున్న మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆటోలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు.

పురోభివృద్ధి ఆశిస్తు

- తెనాలి మున్సిపాలిటీలో పన్ను వసూళ్లు వేగవంతం
- రాయితీ ప్రకటనతో సత్ఫలితాలు



తెనాలి పట్టణ వ్యూ



తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలో పన్నుల వసూలు కౌంటర్

తెనాలిఅర్బన్: తెనాలి పురోభివృద్ధికి తోడ్పడే పన్నుల వసూళ్లపై సిబ్బంది దృష్టిపెట్టారు. ఫలితంగా వసూళ్లు ఊపందుకున్నాయి. ఇప్పటికే సంవత్సరం మొదటి నెలల్లో పన్నులు చెల్లించిన వారికి ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ప్రకటించడం సత్ఫలితాలనిచ్చింది. ఎక్కువ మంది శిస్తుల చెల్లింపునకు ఆసక్తి కనబరిచారు.

తెనాలి పురపాలక సంఘానికి ఇంటి, ఖాళీ స్థలం, నీటి పన్నులతోపాటు షాపుల అద్దెల ద్వారా ఏడాదికి సుమారు రూ.17.30 కోట్ల ఆదాయం సమకూరుతుంటుంది. తెనాలి పట్టణ పరిధిలో సుమారు 35వేలకుపైగా నివాస గృహాలు ఉన్నాయి. వీటికి ఏడాదికి రెండు సార్లు పన్ను విధిస్తారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఒకసారి, అక్టోబర్ నుంచి మార్చి వరకు మరోసారి పన్నులను విధించి వసూలు చేస్తుంటారు. ఈ పన్నుల రూపంలో ఏటా రూ.15.70 కోట్ల ఆదాయం మున్సిపాలిటీకి సమకూరుతుంది. ఇప్పటి వరకు రూ.12.40 కోట్లు వసూలు చేశారు. ఇంకా రూ.3.70 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అలాగే తెనాలి పట్టణంలో 22 మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. వీటి అద్దె ద్వారా ఏడాదికి రూ.1.60 కోట్లు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.1.43 కోట్లు వసూలు చేశారు. ఇంకా రూ.17 లక్షలు వసూలు చేయాల్సి ఉంది. దీనిని బట్టి చూస్తే పన్నుల వసూలులో తెనాలి కొంత ముందు వరుసలోనే ఉన్నట్లు చెప్పవచ్చు. ఇదిలా ఉంటే పట్టణంలోని అనేక భవనాలు, స్థలాలు కోర్టు వివాదాలలో ఉన్నాయి. కోర్టు తీర్పుల్లో నెలకొంటున్న జాప్యం పన్నుల వసూలుకు ప్రతిబంధకంగా మారుతోంది.

31లోపు పన్నులు చెల్లించండి



తెనాలి పట్టణ పరిధిలోని ఇంటి పన్నులు, షాపుల అద్దెలు వసూలుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. సచివాలయంలో పనిచేసే ఉద్యోగులను ఒక బృందంగా ఏర్పాటు చేసి, రోజూ బకాయిదారులను కలిసి పన్నులు వసూలు చేయాలని ఆదేశించాం. ఎప్పటి నుంచో పన్నులు చెల్లించని వారిని గుర్తించి వారికి రెడ్ నోటీసులు అందజేశాం. ప్రజలు ఈనెల 31లోపు పన్నులు చెల్లించాలి. ఆ తర్వాత అపరాధ రుసుం పడుతుంది. సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి.

– కిల్లానా అప్పలరాజు, ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి, తెనాలి పురపాలక సంఘం